# తోడేళ్ళు

పొద్దు బారెడుంది. ఊరికి కోసెడు దూరంలో ఉన్న బంజరు బీడులో గొర్రెల మంద మేస్తుంది. వెనకాలే నడి వయస్సు కాపరి మల్లయ్య భుజంమ్మీద గొంగళీని చంకలోకి వలచుకొని దుడ్డు కర్రను ఆసరా పెట్టుకొని చుట్ట పీలుస్తూ నిల్చున్నాడు.

మేస్తున్న గొర్రెలను చూస్తూ 'ఎన్నిటిని అమ్మితే కూతురు గొర్రెలు పెండ్లికైన అప్పు తీరుద్దాం అని అంచనాలు వేసుకుంటు న్నాడు. పైన పక్షుల గుంపొకటి అరుస్తూ పోయింది. ఉన్నట్టుండి గొర్రెలు ఒక్కసారె బెదిరి దిక్కులు చూడసాగాయి. అది గమనించి మల్లయ్య పొగాకు ఉన్నంత వరకూ చల్లారిన మర్రాకు చుట్టను తంగేడు

చెట్లువైపు విసిరి, చంకలోని కర్రను చేతి లోకి తీసుకొని, భుజం మీద గొంగళిని సరిచేసుకుంటూ మంద దగ్గరికి నడచి నుదుట ఎడమ అరచేతిని పడిగెలా ఉంచి చూపుల్లో ఏకాగ్రతను పెంచి చుట్టూ చూశాడు. కనుచూపు మేరలో తోడేళ్ళు గాని, నక్కలుగాని కనిపించలేదు. అయినా తలలు వంచుకొని మేస్తున్న గొర్రెలు ఎందుకు బెదిరాయెూ అనుకుంటున్నప్పుడే, ఇంకా భయంగా తలలు పైకెత్తి అవతలి గట్టెమ్మటి ఉన్న బాటవైపు చూసి, పరుగు పరుగున వెళ్లి పక్కనే ఉన్న వర్రెలోకి చేరాయి.

చుట్టూ పలుకజమ్మడి పొదలు. వాటి ఆందోళన గ్రహించిన మల్లయ్య మరొకసారి చుట్టూ చూస్తూ వర్రె వైపుకు నడుస్తూ ఊరివైపు చూపు నిలిపాడు. ఇంటి తలుపులను ఎవరో వచ్చి తట్టితే ఇంటిలోని వారు గ్రహించినట్లు పరిగెత్తుకొస్తున్న గుర్రపు డెక్కల శబ్దాన్ని ఆ ప్రాంతంలోని పశుపక్ష్యాదులు విని రాబోయే అపాయాన్ని గుర్తించే నేర్పును పెంచుకున్నాయి. తోడేళ్ళొచ్చినా, తోడేళ్ళలాంటి మనుషులొచ్చినా అవి ఇట్టే పసిగట్టగలవు. గొర్రెలు బెదిరినప్పుడు ఊరివైపు పరిగెత్తి మంద కాడి కుక్క తిరిగి అంతకంటే వేగంగా పరిగెత్తుకొచ్చి తన యజమాని చుట్టూ కొంత సేపు, మంద చుట్టూ కొంత సేపు కుయ్, కుయ్ మంటూ తిరిగి, తిరిగి ఊరివైపు బెదిరి, బెదిరి చూస్తూ వుంది. దాని చూపుల్లో పరిగెత్తుకొస్తున్న తెల్లని గుర్రం , చెవుల్లో దాని డెక్కల చప్పుడు, ఓమాదిరిగా గునుగుతూ ఆందోళనగా అటు ఇటూ తిరగసాగింది. తలలు వంచి మేస్తున్నప్పుడే నేలద్వారా గుర్రపు డెక్కల శబ్దం విన్న గొర్రెలు రానున్న ప్రమాదాన్ని పసిగట్టి బెదరిన తీరును ఆలోచిస్తున్న కాపరి అనుమానాన్ని కుక్క ధృవపరిచింది.

పరిగెత్తుకొస్తున్న గుర్రాన్ని చూడగానే మల్లయ్య కాళ్లల్లో వణుకు మొదలయింది. రాను రాను డెక్కల చప్పుడు ఎక్కువవుతున్న కొద్దీ గుండె వేగం పెరగసాగింది. 'అమ్మో! నా మంద ఇక మాయమయిపోద్ది' అనుకుంటూ గొర్రెలవైపు నడిచాడు. కుక్క బాట మధ్యలో నిల్చొని సమీపిస్తున్న గుర్రాన్ని, దాని మీద కూర్చున్న దొరబాబును, వెనకాల పరిగెత్తుకొస్తున్న జనాల్ని చూస్తూ సన్నగా విషాదంగా మూల్గింది.

అది గమనించిన కాపరి భుజం మీద నల్లని గొంగలినిన నిండా కప్పుకొని గొర్రెల మధ్య తానూ ఓ గొర్రెలా వంగి కూర్చున్నాడు. గొంతులో బలం ఉన్నంతవరకు పెద్దగా మొరుగుతూ శక్తినంతా కూడదీసుకుని గుర్రం మీదికి పరిగెత్తుకొస్తున్న కుక్కను చూసి, దొరబాబు చేతిలోని తుపాకి పేలింది. తుపాకీ శబ్దానికి గొర్రెలన్నీ అటూ ఇటూ కదిలి, భయంతో మళ్ళీ ఒక్క దగ్గరికి చేరాయి మరీ దగ్గరగా దోసిట్లో నువ్వుల్లా. వొర్రెను సమీపించి, గొర్రెల వైపు నడిపిస్తూ ''కావలసి నన్నిటిని పట్టుకోండిర'' దొర అరుపు లాంటి మాటలు.

అరవై ఊళ్ళకు కర్త, నైజాము రాజు ప్రతినిధి, విసున్నారు రామచంద్రారెడ్డి దొర కొడుకే బాబు దొర. తండ్రి గద్దనుకొంటే కొడుకు డేగ! పేదలను పీడించడం బక్కరైతుల నోళ్లు కొట్టడం వాళ్ళ పని. కూలి నాలి జనాలతో వెట్టి చాకిరి చేయించుకోవడం ఎవరన్న ఎదురుతిరిగితే కాల్చి చంపడం, చిన్న చిన్న నేరాలకు పెద్ద పెద్ద శిక్షలు వేయడం వాళ్ల న్యాయం.

''దొర! గొల్లోడు లేనట్టుందే.'' మందవైపు నడుస్తున్న వాళ్లలో నుండి ఒకడు.

''మీపని మీరు కానీయండ్రా.'' గుర్రాన్ని మంద చుట్టూ తిప్పుతూ

తుపాకీలోని తూటా లైనులోనికి సరిచేసుకుంటున్నాడు. వెంట వచ్చిన వాళ్లు బాగా బలిసిన పొట్టేళ్ళ వెనుక కాళ్లు పట్టుకొని ఈడ్చుకెళ్లసాగారు. అతని చూపులతోపాటు అతని చేతిలోని తుపాకీ కూడా ఎవరినో వెతుకుతుంది. ఎక్కడినుండో మూలుగుతున్న శబ్దం వినిపించగా చుట్టూ చూస్తున్నాయి దొర కళ్లు. మంద పక్కనో శబ్దం మెల్లమెల్లగా ఆగిపోగా పక్కకు తల వాల్చింది కుక్క. పూర్తిగా కాలిపోయిన కొవ్వొత్తి కరిగి ఆరి గడ్డ కడుతున్న చమురులో పడి ఉన్న దారంలా దాని రక్తంలో అది. తనకు తినగలిగిన గుణముండి కూడా తమని తమ కొదమల్ని తోడేళ్ల నుండి, నక్కల నుండి కాస్తూ వచ్చి కళ్లెదుటే కన్ను మూసిన తమ నేస్తాన్ని చూసి బాధగా అరిచాయి గొర్రెలు.

కావలసినన్ని పొట్టేళ్లను పట్టుకొన్న వాళ్లు బాట వైపు నడవగా, దొరబాబు తన గుర్రాన్ని కాలి మడిమతో తన్ని ఏదో సైగ చేశాడు. గుర్రం ఎగిరి మంద మీద దూకింది. సముద్రపు అలలు లేచిపడ్డట్టు అయిదారుసార్లు దూకి ఆ తరువాత బాట వైపు పరిగెత్తింది. వెనకాల గొర్రె పొట్టేళ్లను మెడల మీద ఎత్తుకొని దొర మనుషులు.

••••

ఊర్లో దీపాలు వెలిగించే వేళ. ఇంట్లో చమురు దీపాన్ని వెలిగించి ఇంకా దొడ్డిచేరని తన మంద గూర్చి, తన బోయున్ని గూర్చి ఆలోచిస్తూ, పటవ లోని గంజిని ముంతలోకి వంచుకుని తెచ్చి కుక్క తొట్టిదగ్గర పెడుతూ, 'కుక్కన్న ముందొచ్చేదే? అదీ రాలేదు' అనుకుంటూ బయట దర్వాజాలోకి వచ్చి నిలుచుని బజారువైపు చూస్తుంది బీరమ్మ.

'పశువులు ఊరు చేరుతున్నాయి.'

'పక్షులు గూళ్లు చేరుతున్నాయి.'.

మనుషులు ఊరు చేరుతున్నారు. అందరి మందలూ ఊరు చేరుతున్నాయి. 'మరి నామంద! నా మనిషి!' అనుకుంటూ తనలో తాను తలపోసింది.

''ఓ భీరమ్మత్తా'' అంటూ పిలుస్తూ తనవైపే వస్తూన్న పశువుల కాడి పిల్లగాన్ని రెప్పవాల్చకుండా చూస్తూ వెళ్లి నిలుచుంది.

''మీ గొర్రెలు బంధం దగ్గర ఉన్నాయి'' అని చెపుతూ చేతిలోని కర్రతో తన పిక్కపై తానే దరువేసినట్లు కొట్టుకుంటూ నిల్చున్నాడు.

''అట్టనార బిడ్డా! అదే ఇంకా రాలేదేందా అని సూస్తున్న'' అంటూ వెనక్కు వెళ్లి తలుపు దగ్గరికి వేసి గొళ్ళెం పెట్టింది.

''సుట్టూ సూసిన, మల్లయ్య మామ కనిపియ్యలే.''

''అంటే?'' అతన్ని సమీపిస్తూ.

''నివద్దత్తా'' అని తొనకకుండ అన్నాడు

''ఇయ్యాల దొరోని గుర్ర మయితే రాలే కదా?'' భయంతో కూడిన అనుమానంతో భుజాన కొంగును నడుం చుట్టూ బిగించుకుంటూ అడిగింది.

''వొచ్చిందట, నేనయితే సూడలేదు. గొండ్ల ఎంకయ్య తాటి మీదుండి సూసిండట'' అని చెప్పుకుంటూ చేతిలోని కర్రను నేలమీద ఈడుస్తూ తన ఇంటివైపు నడిచాడు.

గద్ద నీడ చూసి కోడి తొక్కులాడినట్టు ''వామ్మో నా కొంప మునిగిందే, నా దీపం - నా దీపం'' అంటూ ఉబికొచ్చే దుఃఖంతో అటూ ఇటూ పరిగెత్తు వుంది.

ఇళ్లలోని ఆడా, మగా అందరూ బయటకు వచ్చి నిలుచున్నారు.

''ఏం జరిగింది?'' అని ఒకరు, ''ఏమయింది'' అని ఇంకొకరు.

''ఆడొచ్చిండట, అందుకే నా మంద రాలేదు. దేవుడో నా మనిషీ రాలేదు. ఓరి దేవుడో! నీకేం పాపం సేస్తినా'' అంటూ రొమ్ము కొట్టుకోసాగింది. అప్పుడామె కళ్లలో నీళ్లు, ముక్కులో తడి.

''అప్పుడే అనుకున్న ఇయ్యాల గుర్రం మన గూడెం కాయొచ్చింది, ఏం కానుందో అని.''

ఓ పెద్ద మనిషి ఎక్కువ సేపు నిలబడలేక పక్కనే ఉన్న ఓ రాయి మీద కూర్చొంటూ అన్నాడు.

''ఆని మొలతాడు తెంప, ఆడొచ్చిండా, ఆడొస్తే ఇంకేముంది?'' అంది ఓ ముసలమ్మ ముక్కు చీదుకుంటూ.

''సూస్తరేం పాండ్రి యాడుందట మంద'' కర్ర లందుకొని కొందరు నడువగా ముందు బీరమ్మ.

తోవ పొడుగుతా శోకం పెడుతూ ఏడుస్తూ ''ఈ బాధలు ఎన్నడు తీరేనం? ఈ బతుకులు ఎన్నడు తెల్లారేనం? ఎన్ని జీవాలనం పట్టుకుపోయిండో? అమ్మి అప్పు తీర్చాలనుకున్నాం. ధనం, ధాన్యం, బంగారం, మా ఆస్తంతా అవే నాయనో! అవి పోయినంక అప్పు తీరేదెట్లా? మేము బతికేదెట్లా దేవుడో? యిగ ఊరిడిచిపోవలే నాయనో!'' అంటూ వడివడిగా నడుస్తూ వుంది. ఆమె వెనక మిగిలిన వాళ్లు.

''మందను మలుపుకపోయి నామనిషిని వదిలిపోయినా సాలు దేవుడో'' మధ్య మధ్య నెత్తి కొట్టుకుంటువున్నది.

చీకటి చిక్కపడుతున్నవేళ్ళు ఎక్కడనో నక్కలు కూతలేస్తున్నవి. బీరమ్మ గుండె నిండా భయం, కళ్ల నిండా దుఃఖం, ఏం జరిగిందో తెలియని అయోమయంలో పరుగులాంటి నడక, బాబు దొర చుట్టు పట్టు ఈ ఊళ్లలో చేస్తున్న పనులు, కథలు కథలుగా అందరూ చెప్పుకునేవి

గుర్తు రాగా గుండెల్లో గుబులు మొదలయింది. కనపడ్డ వాళ్లను కాల్చివేయడం, దొరికింది దోచుకోవడం, మంచిగున్నది ఏది దక్కదట! వెంట ఉన్నోళ్లు అంతేనట! పాతికేళ్లు కూడా సరిగాలేని ఆ దొరబాబుకు ఎదురే లేదట.

షావుకారు మట్టయ్య దగ్గర కందిలి అడుక్కొని అందరిని కలేవచ్చి, ముందు ముందుగా నడవసాగాడు బీరమ్మ అన్న కొడుకు. బందంల కొచ్చారు. బిక్కు మిక్కు మంటున్న గొర్రెల మంద, భయం భయంగా చూస్తున్న వాటి కళ్లు చీకట్లో మిణుగుడు పురుగుల్లా మెరుస్తున్నాయి. ఎదురుగా రక్తపు మడుగులో కుక్క. బీరమ్మ చూపులు భర్తను వెదుకుతున్నాయి. గుండె చెరువవుతుంటే బీరమ్మ గొర్రె గొర్రెను తాకసాగింది. బాగా బలిసి అమ్మకానికి సిద్ధమైన పొట్టేళ్లు లేవు. కట్టె మోపు కొచ్చిన కొదములు లేవు. 'ఒక్కటా రెండా పదింటిని పట్టుకపోయింద్రని' నోరు కొట్టుకొంటూ ఉంటే చేతి గాజులు చిట్లి కింద పడ్డాయి.

వెంటొచ్చిన వాళ్లు చెట్లు, చేమ, పొదలు, గుండ్లను వెదకసాగారు.

ఎక్కడా మల్లయ్య అలికిడి లేదు.

పేరు పెట్టి పిలిచారు. చప్పట్లు కొట్టి సైగ చేశారు.

శబ్దం లేదు. మనిషి కదలిక లేదు.

ఉన్నట్టుండి గుంపుగా ఉన్న గొర్రెలు ఒక్కసారిగా కదిలి మధ్యన ఖాళీ చేసాయి. మేనల్లుని దగ్గర ఉన్న కందిలిని అందుకొని బీరమ్మ ఆ ఖాళీ స్థలంలో పడి ఉన్న ఆకారాన్ని తాకింది. అంతే ఆమె చేతిలోని కందిలి జారిపడి పక్కన నిలుచుంది. గొంగళిని తొలగించి భర్తను ఒడిలోకి తీసుకుంది. వెన్నెముక విరిగి డొక్కలోకి వంగిపోయి ఉంది. వణుకుతున్న చేతులతో బోర్లపడి ఉన్న తన భర్త ముఖాన్ని తన వైపు తిప్పుకున్నది.

అంతే ఆమె చూపు నిల్చిపోయింది. నోరు మూగపోయింది. పక్కన్నే నిలుచున్న పెద్దమనిషి వొకరు ముక్కు దగ్గర వేలు ఉంచి ''ఎప్పుడో శ్వాస అగిపోయింది''. అన్నాడు.

ఒంటి మీదన్నీ గుర్రపు డెక్కల గుర్తులు, కళ్లల్లో నుండి ముక్కుల్లో నుండి రక్తపు చారలు.

అందరూ దుఃఖపు చూపులతో తల లొంచుకున్నారు.

ఆ తలలు పైకెత్తే దెప్పుడో?

•1994
ఆంధ్రప్రభ
జూన్ '95